# బిజెపి ప్రభుత్వం అమలుచేస్తున్న మత, కులతత్వాలపై పోరాడి ఓడించండి

**అనాదిగా** మనదేశంలోని పాలకవర్గాలు - శ్రామిక ప్రజానీకంపై తమ ఆధిపత్యాన్ని, దోపిడీని సమర్ధించుకునేందుకు, చాలా ద్వేషపూరితమైన మనుశాస్త్రాన్ని శాశ్వతీకరించారు. మతం ముసుగులో హిందూ - బ్రాహ్మణీయ వర్ణ వ్యవస్థ ద్వారా సమాజంలోని కుల, ఉపకులాల, కుల బహిష్కృతుల జన బాహుళ్యాన్ని, అందులోని ప్రతి ఒక్క సమూహాన్ని వేరుపరిచే విధంగా, సజాతి వివాహాలకు కట్టుబడే విధంగా దానిని చట్టబద్ధం చేయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో జాతివాదంతో, జాతి వివక్షతతో మాత్రమే సరిపోలే దుర్మార్గమైన సామాజిక వివక్ష రూపాలతో దానిని అమలు చేస్తున్నారు. ఈ వ్యవస్థ సహజ అణచివేతల స్వభావపు గర్భం నుండే, ఒక సమానత్వ సమాజం కోసం వెతుకులాడుతూ తిరుగుబాటు బావుటా ఎగురవేసిన మహావీరుడు, గౌతమ బుద్ధుడు, కబీర్, గురునానక్... ఇంకా భక్తి ఉద్యమానికి చెందిన అనేకమంది ముందుకు వచ్చారు. అయితే జైన మతం, బౌద్ధమతం, సిక్కు మతాలు-హిందూ కుల వ్యవస్థలో వ్యాపించి ఉన్న అన్ని ప్రభావాలకు లోనయ్యాయి. క్రిస్టియన్, ఇస్లాం మతాలకు సాంఘిక వివక్ష భావన పరాయిదే అయినప్పటికీ వారు కూడా దానికి బాధితులుగా మిగిలారు. తదనంతర కాలంలో సమానత్వానికి సంబంధించిన బూర్జువా భావాన్ని మనసులో లగ్నం చేసుకున్న ఫూలే, అంబేద్కర్, పెరియార్ వంటి సంఘసంస్కర్తలు... అప్పటికే బాగా వ్యాపించి ఉన్న దుర్మార్గ భావనలైన కర్మ, అమానవీయ కులవివక్ష, అంటరానితనాల సంకెళ్ళను బ్రద్దలు కొట్టేటందుకు, ఆత్మగౌరవం, సమానత్వం సాధించేందుకు, పీడిత ప్రజలను కదిలించారు. అయితే మానవ జాతి చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్రేనని, కుల వ్యవస్థ అనేది కుల అణచివేతకు చెందిన నీచమైన, అత్యంత మొరటు రూపమని, ఈ దోపిడీ అణచివేతల కుల వ్యవస్థకు వ్యతిరేకంగా సాగించే అవిశ్రాంత వర్గ పోరాటం ద్వారా మాత్రమే దానిని ధ్వంసం చేయడం, నిర్మూలించడం సాధ్యమవుతుందనే అంశాన్ని గుర్తించడంలో వారు విఫలమయ్యారు.

ఈనాడు ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ బహుళ వైరుధ్యాల సాలెగూడులో చిక్కుకొని అల్లాడుతూ, తాను సృష్టించుకున్న శిఖర స్థాయి సమస్యల కింద పడి నలుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా తిరుగుబాట్ల అలలు ఎగస్తూ ఉండగా, పీడిత జాతులపై, ప్రజానీకంపై దోపిడీని అది ఇంకెంత మాత్రమూ కొనసాగించ లేదు. మన దేశం వంటి అర్ధవలస, అర్ధఫ్యూడల్ దేశాలలో తీవ్రమవుతున్న ఆర్థిక సంక్షోభంలో తాము కూడా రోజులు లెక్కించుకోవలసి వస్తుందనే అంశాన్ని మన దేశీయ దళారులు గుర్తించారు.

బహుళ ప్రచారంతో ముందుకు తేబడిన ఆర్థిక సంస్కరణలు -సామ్రాజ్యవాదుల దోపిడీకి మన దేశ ద్వారాలను విశాలంగా తెరచి, సంపన్నులు మరింత సంపన్నులు అయ్యేందుకు అవకాశం కల్పించింది. అయితే అదే సమయంలో మన ప్రియతమ దేశంలోని అత్యధిక ప్రజానీకాన్ని పేదరికం, కరవు, నిరుద్యోగాల అగాధాల్లోకి లోతుగా పడదోశారు. ప్రజలను మోసగించేందుకు పాలకవర్గాలు గుడ్డి విశ్వాసాలను మత భావోద్వేగాలను ప్రేరేపించి, తద్వారా ప్రజలు మతతత్వ, కులతత్వ, సంకుచిత ఉన్మాదాలలో చిక్కుకుపోయేలా ప్రేరేపించాలని నిర్ణయించు కున్నారు. వారి నేరపూరిత పథకాలను నెరవేర్చుకోవడానికి, ప్రజల నడుమ విద్వేషాగ్నిని రగిలించి, విషాన్ని చిమ్మటంలో వారి రాజకీయ మార్గదర్శకులతో కలగలిసిన మతాంధులను, ఛాందస వాదులందరినీ తమ చుట్టూతా సమీకరించుకున్నారు. తద్వారా ప్రజలను విభజనకు గురిచేసి ఒకరితో ఒకరు కొట్లాడుకుంటూ తాము ఎదుర్కొనే వాస్తవిక సమస్యలపై స్పందించలేనివారుగా మలచుకున్నారు.

1980ల నుండి పాలకవర్గాలు అధికారం కోసం తమ తమ ఓటు బ్యాంకులను నిర్మించుకునే అత్యాశలో పోటీలు పడుతూ అభివృద్ధి నిరోధకుల, ఉన్మాదుల, మతతత్వ శక్తుల మార్గాన్ని నగ్నంగా చేపట్టారు. దీనిలో 'లౌకికవాద' కాంగ్రెస్, 'స్వయం ప్రకటిత హిందూ మత రక్షకులైన' బిజెపిలు-తమ అధికార క్రీడలో ఎవరికి ఎవరూ తీసిపోరు. 1984లో తన 'బ్లూ స్టార్ ఆపరేషన్' ఫలితంగా ఇందిరాగాంధీ హత్యకు గురైంది. దీనికి ప్రతీకారంగా హిందూ ఉన్మాదులు కాంగ్రెస్ వెనుక సమీకృతులై అమాయక సిక్కులను వూచకోత చేస్తూ, జాతి హనన హింసకాండ సాగించారు. 1989లో దీర్ఘకాలంగా వేచి చూస్తున్న రిజర్వేషన్లపై మండల్ కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నప్పుడు, హిందువులందరినీ అయోధ్యలో ఊహాజనిత రామజన్మభూమిని విముక్తం చేసేందుకు తన వెనుక సమీకృతం కావలసిందిగా బిజెపి పిలుపునిచ్చింది. ఈ క్రమంలో దేశవ్యాప్తంగా జరిగిన రథయాత్రలో కుల వ్యవస్థ బాధితులు సైతం మతతత్వ ఉన్మాదంతో,ఈ మతతత్వ ఉన్మాదుల వెనుక కొట్టుకుపోయారు.

1992 డిసెంబర్ 6న బిజెపి శివసేనలకూటమి మరియు ఆర్ఎస్ఎస్/ విహెచ్‌పి/ భజరంగ్ దళ్‌ల కాషాయ సైన్యం, కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వ మౌన ప్రోత్సాహ ఎత్తుగడతో, అక్కడ ఉనికిలో ఉన్న నాలుగు శతాబ్దాల పురాతనమైన బాబ్రీ మసీదు గోపురాల పైకి ఎక్కి దాడులు సాగించి, వాటిని ఒకటొకటిగా నేలమట్టం చేశారు. దాడులు అన్నిచోట్లా బ్రద్దలయ్యాయి. హిందూ మతోన్మాదులు కోపోద్రేకాలతో

రెచ్చిపోయారు. ప్రభుత్వ పోలీసుల తోడ్పాటుతో శివ సైనికులు బొంబాయి, సూరత్‌లలో ఘోరంగా వందలాదిమంది మైనారిటీ లను హత్యగావించి, వేలాది మందిని నిర్వాసితులను చేశారు.

తదనంతరం ఈ హత్యలకు ప్రతీకారంగా 1992 డిసెంబర్, 1993 జనవరిలలో జరిగిన బొంబాయి మత కల్లోలాలలో ముస్లిం ఉన్మాదులు బొంబాయి ప్రేలుళ్లకు పాల్పడి అమాయక పౌరుల హత్యలకు కారణమయ్యారు. ఈ బాంబు పేలుళ్ల కేసులో నిందితులుగా జైల్లో ఖైదీలుగా ఉన్న వందలాదిమంది ముస్లిం యువకులపై టాడా కేసులు బనాయించి తక్షణం అరెస్ట్ చేయగలిగిన ప్రభుత్వం, బాబ్రీ మసీదు కూల్చివేత నిందితులను, బొంబాయి, సూరత్ దాడులలో హంతకులను మాత్రం నిష్పూచిగా విడిచిపెట్టింది.

దాదాపు ఆ ఘటనలు జరిగిన 20 సంవత్సరాల తర్వాత బిజెపి 2014లో అధికారంలోకి వచ్చింది. అది 2019 సంవత్సరంలో భారీ ఆధిక్యతతో మరోసారి తిరిగి ఎన్నికయింది. అది హిందూ రాజ్యాన్ని, సనాతన ధర్మ రక్ష అనే మంత్రాలను వల్లె వేస్తోంది. దానిని ప్రశ్నించిన లేదా ఖండించిన వారిని ఫాసిస్టు శక్తులు లక్ష్యంగా చేసుకుంటున్నాయి. అనేక సంవత్సరాలుగా సుప్రీంకోర్టులో నిలిపి ఉంచబడిన కేసులో తీర్పును వెలువరించే విధంగా బిజెపి ప్రభుత్వం చేసుకోగలిగింది.

వందలాది సంవత్సరాలుగా కొనసాగుతున్న బాబ్రీ మసీదు అంశంలో 2019 సంవత్సరంలో సుప్రీంకోర్టు వెలువరించిన తీర్పు, వివాదంలో కీలకమైనదిగా ఉంది. తీర్పు ఇచ్చిన నాటినుండి నేటి వరకు హిందూ మతతత్వం వైపు ప్రజలను మళ్ళించటానికి బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు బరితెగించి చేసిన ప్రయత్నాలతో పాటు దేవాలయ నిర్మాణ కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. బిజెపి, కాంగ్రెస్ ఇతర పాలక పార్టీలన్నీ మతతత్వరేఖలపై ప్రజలను విభజించేందుకు ఈ వివాదాన్ని ఉపయోగించుకున్నాయి. అదే సమయంలో దేవాలయ నిర్మాణ కాలమంతా మత కల్లోలాలు, కుల వివక్ష, అయోధ్యలో మందిర పరిసరాల్లోని ప్రజల షాపుల, ఇళ్ల కూల్చివేతలు ఎడతెగకుండా కొనసాగాయి. 40 కిలో గ్రాముల వెండి ఇటుకతో మందిర నిర్మాణానికి మోడీ పునాదిరాయి వేశాడు.

జనవరి 22న బాల రాముని 'ప్రాణ ప్రతిష్ట' క్రతువును అయోధ్యలో అట్టహాసంగా నిర్వహించారు. "రాముడొచ్చాడు..... మన రాముడొచ్చాడు.... ఐదు శతాబ్దాల భారతీయుల కల సాకారమైంది..." అంటూ వార్తాపత్రికలు పతాక శీర్షికలతో, టీవీ ఛానళ్లు నిరంతరాయ ప్రసారాలతో, హంగు ఆర్భాటాలతో సాగే బాల రాముని 'ప్రాణప్రతిష్ట' అంశంపై దేశ ప్రజల దృష్టి నిలిపేలా చేశారు. ప్రజా సంక్షేమంపై, వారి అభివృద్ధిపై కనీస వ్యయం వెచ్చించలేని ప్రభుత్వం, వేలాది కోట్ల రూపాయల ప్రజాధనాన్ని రామమందిర నిర్మాణం పైన, అయోధ్య పట్టణ అభివృద్ధి కార్యక్రమాల పైన వెచ్చించింది. 'ప్రాణ ప్రతిష్ట' క్రతువు అనంతరం అక్కడ సమీకృతులైన వారిని ఉద్దేశించి ప్రధాని మోడీ ప్రసంగిస్తూ, "భవ్య మందిర నిర్మాణం పూర్తయింది. ఇక ఇప్పుడు జాతి నిర్మాణంపై దృష్టి సారించాలి. దృఢమైన, సమర్థవంతమైన, దైవత్వం కలిగిన, సుసంపన్న భారతదేశాన్ని నిర్మించేందుకు ఈ క్షణం నుండి ప్రతినిబూనాలని" పిలుపునిచ్చాడు. దీనికి తోడుగా వారణాసిలోని జ్ఞానవాపి, శ్రీకృష్ణుని జన్మస్థానం మధుర వంటి అంశాలను లేవనెత్తుతూ మతపరమైన వివాదాలను ప్రేరేపిస్తున్నారు. వేల సంవత్సరాల నాటి వివాదాలలో ఏది సత్యమో, ఏది వాస్తవమో ప్రజలపై తోస్తూ వారు వెనక కూర్చొని, ప్రజల దుస్థితిని చూసి ఆనంద పడుతున్నారు.

గత కాంగ్రెస్ ప్రభుత్వం, ప్రస్తుతం మోడీ నాయకత్వంలోని బిజెపి ప్రభుత్వం చేపట్టిన సామ్రాజ్యవాద దళారీ ఆర్థిక విధానాల అమలు ఫలితంగా ప్రజలు తీవ్ర సంక్షోభంలోకి నెట్టబడ్డారు. పాలకవర్గాలు మతాన్ని మత్తుమందుగాను, ఆయుధంగాను ఉపయోగిస్తూ, తమ జీవితాలను విచ్ఛిన్నం చేస్తున్న సవాలక్ష సమస్యల గురించి ప్రజలను ఆలోచింపనీయకుండా నిలువ రిస్తున్నాయి. అదేవిధంగా ఒక ప్రజాస్వామిక లౌకిక రాజ్యంగా ప్రకటించుకుంటూ, ఫ్యూడల్ మత సాంప్రదాయాలను, మత ఆధిపత్యాన్ని, కుల వ్యవస్థను దృఢపరచడాన్ని ప్రోత్సహిస్తున్నాయి. ఈ రామ మందిర నిర్మాణంలో గొప్ప పాత్రను తాము చేపట్టి నిర్వహించామని ప్రకటించుకుంటూ, ప్రజలు ఈ సంఘటనను మరువక మునుపే ఎన్నికలను ముందస్తుగా జరిపేందుకు, ఎన్నికలలో విజయం సాధించేందుకు బిజెపి ప్రయత్నిస్తోంది. కనుక ప్రజలు ఈ భ్రమలకు గురికారాదు. పాలకవర్గాల ఫాసిస్టు మతోన్మాదానికి వ్యతిరేకంగా, సామ్రాజ్యవాద ఆర్థిక విధానాలకు దాసోహమైన పాలకుల దళారీ విధానాలకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సంసిద్ధం కావాలి.

**(2024 ఫిబ్రవరి 'క్లాస్‌స్ట్రగుల్' సంపాదక వ్యాఖ్యకు అనువాదం)**

★★★★★